సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్లండి



బండారు దత్తాత్రేయను సన్మానిస్తున్న నాయకులు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు ఆదివారం హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగాణ రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని దత్తాత్రేయను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. కొమ్ము అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

సందడి చేసిన విద్యార్థులు



విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు

రాంగోపాల్‌పేట్: పలు ప్రభుత్వ పాఠశాలల వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఓల్డ్ నల్లగుట్ట, న్యూబోయగూడ, మేకలమండి ప్రభుత్వ పాఠశాల వార్షిక వేడుకలను నల్లగుట్ట పాఠశాలలో నిర్వహించారు. ఇస్స ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండర్ హైమావతి, శిల్ప, శౌరి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు కోరారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూర విద్య కేంద్రం సెమినార్ హాలులో విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక పురోగతి, ఆర్థిక అభివృద్ధికి దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, గుల్బర్గ వర్సిటీ వీసీ ప్రొ.బట్టు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఇంగ్లిష్ నేర్చుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతి విద్యార్థి ఇంగ్లీష్‌ను నేర్చుకోవాలని ఐఆర్ఎస్ చైర్మన్, సింగరేణి కాలరీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అన్నారు. ఆదివారం ఓయూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ)లో రాష్ట్ర గవర్నర్ నిధులతో ట్రైబల్ విద్యార్థులకు నెలరోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బలరాం మాట్లాడుతూ ఇంగ్లీష్‌ను అందరు నేర్చుకోవాలని అందుకు సింగరేణి సంస్థ తరఫున ఆర్థిక సహాయం అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఎల్‌టీసీ డైరెక్టర్ ప్రొ.విజయ్, ప్రొ.సాద నవీన్, క్రిస్టోఫర్, మాధవి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



సికింద్రాబాద్: గుర్తు తెలియని ఓ వ్యక్తి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నెంబర్ 10 వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు (17023) కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడికి సుమారు వయసు 30–35 వరకు ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

అంధకారంలో బస్తీలు



ఇందిరానగర్ కాలనీలో అలుముకున్న అంధకారం

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో గత కొన్ని రోజుల నుంచి వీధిలైట్లు వెలగటం లేదు. దీంతో స్థానికంగా అంధకారం అలుముకుంటుంది. ప్రధానంగా లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో దాదాపు పది రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. ఇందిరానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నేతికార్ మహేశ్ మాట్లాడుతూ ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.

చురుగ్గా ఆస్పత్రి నిర్మాణం

ఏడాదిలోపు అందుబాటులోకి 70 పడకల ఆసుపత్రి



సీతాఫల్‌మండిలో ఆసుపత్రి నిర్మాణం పనులు

- వేగవంతంగా ఆసుపత్రి నిర్మాణ పనులు
- సీతాఫల్‌మండిలో అధునాతన ఆసుపత్రి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో అధునాతన ఆసుపత్రి భవన సముదాయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు నెలల క్రితం ఈ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొత్త ఆసుపత్రి నిర్మాణం పేరిట గత ప్రభుత్వ హయాంలో పాతభవనాలను నేలమట్టం చేశారు. వివిధ సాంకేతిక సమస్యల ఫలితంగా ఏడాది కాలంగా నిర్మాణం పనులు ముందుకు సాగలేదు.

◆ సీతాఫల్‌మండిలోని కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో కొత్తగా 4 అంతస్తుల భవనాన్ని నిర్మించి 70 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.12.75 కోట్ల నిధులను మూడేళ్ల క్రితం మంజూరు చేసింది. ఇక్కడ ప్రసూతి సేవలతోపాటు అన్ని రకాల వైద్యపరీక్షలు, శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తేనున్నారు. ఒక్కో అంతస్తులో ఒక్కో విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపదనలు సిద్ధం చేశారు.

ఏడాదిలోగా అందుబాటులోకి ..

సీతాఫల్‌మండిలో 70 పడకల ఆసుపత్రి నుంచి వైద్య సేవలను ఏడాదిలోగా అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ డిప్యూటీ స్పీకర్ హోదాలో కొనసాగిన సమయంలో ఆసుపత్రి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.12.75 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఏడాది క్రితమే పనులు ప్రారంభమైనా అర్థాంతరంగా ఆగిపోవడంతో రోగులు అసౌకర్యానికి గురయ్యారు.

నాటి కలెక్టర్ పేరుతో..

కుట్టివెల్లోడి అనగానే ప్రసూతి ఆసుపత్రి పేరు అని ఈ ప్రాంత ప్రజలు చెబుతారు. కుట్టివెల్లోడి అంటే ఒకప్పటి జిల్లా కలెక్టర్ పేరు. 1962 ప్రాంతంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా కుట్టివెల్లోడి అనే మహిళా అధికారి పనిచేశారు. ఆ కాలంలో ఆమె నిర్ణయంతో ఇక్కడ సీతాఫల్‌మండికి ఆసుపత్రి వచ్చి గర్భిణీలకు వైద్యం, ప్రసూతి సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పట్లోనే నిర్మించిన ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి ఇక్కడి ప్రజలు ఆమె పేరును నామకరణం చేసుకున్నారు.

ఒకే ప్రాంగణం నుంచి సేవలు..

సీతాఫల్‌మండిలో ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన వెంటనే నాలుగు విభాగాల వైద్య సేవలు ఇక్కడి నుంచే అందించనున్నారు. ప్రస్తుతం మెటర్నిటీ సేవలు మెట్టుగూడలోని ఆర్టీసీ భవనంలో, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్క భవనంలో సాధారణ వైద్య సేవలు, గాంధీ ఆసుపత్రి నుంచి టీబీ, లెప్రసీ వైద్య సేవలు కొనసాగుతున్నారు. వీటన్నింటిని ఒకే భవనంలోకి తేవడంతోపాటుగా ఓపీ, అత్యవసర విభాగం, ఫార్మసీ కేంద్రాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

'కంటోన్మెంట్‌ను ఆదర్శంగా తీర్దిదిద్దుతాం'



కస్తూరి నగర్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ల కోసం అప్పగించిన కంటోన్మెంట్ భూముల పరిహారం సొమ్ము రూ.300 కోట్లతో కంటోన్మెంట్‌లో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆదివారం బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి ఆరోవార్డు కస్తూరి కాలనీలో, ఒకటో వార్డు కంసారీ బజార్, హనుమాన్ నగర్‌లో నూతనంగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కేంద్రం నుంచి అందే రూ.300 కోట్ల నిధుల ద్వారా భూగర్భ డ్రైనేజీ పనులతో పాటు నాలాలను ఆధునీకరిస్తామన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీలో భాగంగా నగర వ్యాప్తంగా నాలాలను అభివృద్ధి చేసి, కంటోన్మెంట్‌ను విస్మరించిందన్నారు. ఈ నేపథ్యంలో నాలాల ఆధునీకరణకు కనీసం రూ.100 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి పాలనా అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ వార్డు అధ్యక్షులు అధ్యక్షులు ప్రతీక్ జైన్, జైపాల్ రాకేష్, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ పూజ

సనత్‌నగర్: వసంత పంచమి సందర్భంగా సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో సరస్వతి అష్టోత్తర సహిత పుస్తక పూజ కార్యక్రమం అత్యంత కనులపండువగా జరిగింది. మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో 5–10 తరగతుల విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి పూజలో పాల్గొన్నారు. మోడల్‌కాలనీ, సుందర్‌నగర్‌లతో పాటు సనత్‌నగర్ పరిసర ప్రాంతాల నుంచి చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ప్రతినిధులు డి.బుచ్చిబాబు, సత్యనారాయణ, హారిక, పావని తదితరులు పూజకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



సరస్వతి అష్టోత్తర సహిత పుస్తక పూజ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరైన చిన్నారులు

ఘనంగా ఆటో డ్రైవర్స్ యూనియన్ వార్షికోత్సవం



యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

బన్సీలాల్‌పేట్: యువశక్తి ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఆదివారం బన్సీలాల్‌పేట్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా డ్రైవర్లు కేక్‌ను కట్ చేసి ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు వై. శ్రీనివాస్ ముదిరాజ్‌ను ఘనంగా సత్కరించారు. యూనియన్ ఏర్పాటులో క్రియాశీలకమైన పాత్ర నిర్వహించి ...ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. యూనియన్ నాయకులు రామ్మోహన్, టి. శ్రీనివాస్, కె. విజయ్‌కుమార్, శ్రీనివాస్, మొగులయ్య, లక్ష్మీనారాయణ, జయప్రకాష్, నవీన్ ముదిరాజ్, ఫెరోజ్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన చిన్నారులు



కరాటేలో పతకాలు సాధించిన బేగంపేట ఓల్డ్ పాటిగడ్డ గ్రౌండ్ చిన్నారులు..

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్ పాటిగడ్డ గ్రౌండ్ వేదికగా కొనసాగుతున్న జీహెచ్‌ఎంసీ కరాటే శిక్షణ శిబిరం చిన్నారులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు. వరల్డ్ నకయమ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో ఇక్కడి చిన్నారులు ఆరు బంగారు పతకాలు, నాలుగు సిల్వర్, ఒక బ్రాంజ్ పతకాలను సాధించారు. వీరిని గ్రాండ్ మాస్టర్ కాంతేశ్వర్, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్లు కళ్యాణ్, చందులు అభినందించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిందే..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బన్సీలాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సర్కారు కూలడం ఖాయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన 'వేయిల గొంతులు ...లక్షడప్పుల' జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మొట్టమొదటగా స్పందించి వర్గీకరణ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి 5 నెలలు గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఓపిక నశించిన తర్వాతే ఉద్యమానికి సిద్ధమయ్యామన్నారు. ఈ నెల 7న నగరంలో వేయిల గొంతులు...లక్షడప్పుల కార్యక్రమాన్ని లక్షలాది మందితో మహా సాంస్కృతిక కార్యక్రమంగా నిర్వహించి ప్రపంచానికి చాటుతామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జీ టీవీ నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, బీసీ నాయకులు పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పంజగుట్ట: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ–డి నుండి బీసీ–ఎ లోకి మార్చాలని వివిధ ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ ముదిరాజ్ సంఘాల నాయకులు ఉప్పరి నారాయణ ముదిరాజ్, బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, డాక్టర్ వై.శివ ముదిరాజ్‌లు మాట్లాడుతూ .. ముదిరాజ్‌లను బీసీ–డీ నుండి బీసీ–ఎ లోకి మార్చకపోవడంవల్ల విద్యా, ఉద్యోగాల్లో ముదిరాజ్ యువత ఎంతో నష్టపోవాల్సి వస్తుందన్నారు.

పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు ఆదివారం వీసీ ప్రొ.కుమార్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచినందున పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచి రీనోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర కార్యదర్శి సుమంత్ పేర్కొన్నారు. రీసెర్చ్ సెంటర్లు, పీజీ సెంటర్ల ప్రొఫెసర్లకు సైతం పీహెచ్‌డీ గైడ్‌షిప్ ఇవ్వాలన్నారు.

'జాబిలమ్మ' కవితాసంపుటి ఆవిష్కరణ



రచయిత సుధాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం పూర్వ విద్యార్థి విత్తనాల సుధాకర్ రచించిన జాబిలమ్మ కవితా సంపుటి పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు జాబిలమ్మ పుస్తకంలోని కవితలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా కవి,రచయిత సుధాకర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆశా భాను కంప్యూటర్ సిస్టమ్స్ డైరెక్టర్ శాంతప్ప రావు, సైంటిస్టు కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ సిటీలైట్ చౌరస్తాలో ఆదివారం గ్యార్వీ షరీఫ్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, ప్రేమ్‌కుమార్, గౌరీ శంకర్, విజయ్‌కుమార్, మహేష్, అర్జున్‌లతో పాటు నిర్వాహకులు జావీద్, శివ తదితరులు పాల్గొన్నారు.

భారీ నిర్లక్ష్యం

- నిషేధిత వేళల్లో తిరుగుతున్న లారీలపై కేసులు
- తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- ఉల్లంఘిస్తే జైలుకే..
- రోడ్డెక్కితే వాహనం సీజ్

7 నెలల్లో 4509 లారీలకు జరిమానాలు



నిషేధిత వేళల్లో తిరుగుతున్న డీసీఎంలను సీజ్ చేసిన బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: తన కూతురిని స్కూల్‌లో దింపేందుకు వెళ్తుండగా నిషేధిత వేళల్లో వచ్చిన ఓ లారీ ఢీకొనడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వారం రోజుల క్రితం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నిషేధిత వేళల్లో ఆ లారీ రోడ్డు పైకి రాకుండా ఉంటే చిన్నారి ప్రాణాలు పోయి ఉండేవికావు. చాలాచోట్ల ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు, లారీలు స్కూల్ వేళల్లో రోడ్డెక్కుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు ఇ–చలాన్లు విధించడమే కాకుండా ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నా లారీలు మాత్రం తిరుగుతూనే ఉన్నాయి. గతేడాది జులై 1వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో నిషేధిత వేళల్లో భారీ వాహనాలు 1504 రోడ్ల పైకి ఎక్కాయి.అంతేకాక డీసీఎం వాహనాలు 2346, రెడీమిక్స్ వెహికల్స్ 614 తిరిగాయి.వీరందరికీ పోలీసులు ఇ–చలానాలు జారీ చేశారు.

◆ పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత వేళల్లో డీసీఎం వాహనాలు 347, ఇతర భారీ వాహనాలు 440, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెడీమిక్స్ వెహికల్స్ 20, డీసీఎంలు 769, భారీ వాహనాలు 399, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెడీమిక్స్ వెహికల్స్ 594, డీసీఎంలు 1,006, ఇతర భారీ వాహనాలు 239, బంజారాహిల్స్ ట్రాఫిక్ పరిధిలో డీసీఎంలు 224, భారీ వాహనాలు 426 రోడ్డెక్కగా వీటన్నింటికీ ఇ–చలానాలు జారీ చేశారు.

◆ పంజగుట్ట, ఎస్సార్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 21 రెడీమిక్స్ వెహికల్స్, 11 డీసీఎంలు, 13 లారీలపై ఆయా పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.ఈ వాహనాలను సీజ్ చేసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు.

అనుమతించిన వేళలు ఇవే..

◆ లారీలు రాత్రి 10 నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే ప్రధాన రహదారులపై, అంతర్గత రహదారుల్లోనూ, లింక్ రోడ్లలోనూ తిరగాలి.

◆ డీసీఎం లాంటి మీడియం గూడ్స్ వెహికల్స్ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి రాత్రి 9 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు తిరగవచ్చు.

◆ ట్రావెల్ బస్సులు రాత్రి 10 నుంచి ఉదయం 8 గంటల వరకు మాత్రమే తిరగాలి.

◆ నిషేధిత వేళల్లో తిరిగితే రూ.2000 జరిమానాతో వాహనం సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు.

సా–మా హోటల్ వ్యాలెట్ డ్రైవర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: నిర్లక్ష్యంగా తన కారు నడిపి ఇంజిన్ కాలిపోవడానికి కారకులైన హోటల్ పైన, వ్యాలెట్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..వెంగళరావునగర్‌లో నివసించే సినీ దర్శకుడు సమీర్ హుస్సేన్ గత నెల 27వ తేదీన ఫిలింనగర్ రోడ్ నెంబర్–1లోని సా–మా ది ఇండియన్ కిచెన్ హోటల్‌కు తన స్నేహితుడితో కలిసి డిన్నర్ చేయడానికి రాత్రి 9 గంటలకు తన స్కోడా కారులో వెళ్లి హోటల్ ముందు పార్కింగ్ చేశాడు. కొద్దిసేపటికే వ్యాలెట్ పార్కింగ్ డ్రైవర్ వచ్చి కారును పార్కింగ్ స్థలంలో పార్క్ చేస్తానంటూ తాళం చెవులు తీసుకున్నాడు. తింటున్న సమయంలోనే రెస్టారెంట్ యజమానురాలు సమ్‌జన వచ్చి మీ కారు కాలిపోతుందని చెప్పడంతో సమీర్ పార్కింగ్ చేసిన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే కారు దగ్ధమైంది. సా–మా హోటల్ నిర్వాహకులు తమ కస్టమర్ల కార్లను కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ పార్కింగ్ స్థలంలో ప్రతిరోజూ అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. సమీర్ కారును కూడా అక్కడే పార్కింగ్ చేశారు. కారును నడిపిన వ్యాలెట్ డ్రైవర్ ఆదిత్య మోహన్ జా నిర్లక్ష్యంగా ఒకటో నెంబర్ గేర్‌లో నడపడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందని, దీనిపై సా–మా హోటల్‌తో పాటు యజమానురాలు సమ్‌జన, వ్యాలెట్ పార్కింగ్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 316(2), 324 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.